క్లుప్తంగా

నిర్భయంగా ఓటు వేయండి

చర్ల: మండలంలోని పూసుగుప్ప సమీపంలో బుధవారం సాయంత్రం మావోయిస్టులు ఓ లారీని దగ్ధం చేయడంతో స్థానికుల్లో ఒక్కింత ఆందోళన నెలకొంది. అయితే పోలీసు ఉన్నతాధికారులు ఈ ప్రాంతాల్లో ముమ్మరంగా పర్యటించి.. తామున్నామని భరోసా నిస్తున్నారు. నిర్భయంగా ఓటు వేయాలని సూచిస్తున్నారు. చర్ల మండలంలో ఉన్న 36 పోలింగ్ కేంద్రాల్లో ఉంజుపల్లి, తిప్పాపురం గ్రామాలు మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాలుగా ఉన్నాయి. పోలీసు సిబ్బంది అందుకు ధీటుగా ఇక్కడ ఫోకస్ వేశారు. ప్రజలు ఓటు వేసేందుకు అనుగుణమైన వాతావరణాన్ని తీసుకురావడంతో కృషి చేస్తున్నారు. చర్ల మండలంలో 31,236 మంది ఓటర్లు ఎటువంటి ఆందోళనా లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.

దర్జాగా నడుస్తున్న బెల్ట్‌షాపులు

చర్ల: ఎన్నికల నిబంధనల్లో భాగంగా ఈ నెల 28 సాయంత్రం నుంచి డిశంబర్ 3 సాయంత్రం వరకు మద్యం దుకాణాలను మూసివేయాలని ఎన్నికల అధికారులు ఆదేశాల జారీ చేసిన నేపథ్యంలో మండల కేంద్రంలో ఉన్న లైసెన్స్‌డ్ మద్యం దుకాణాలు మూసి వేసినప్పటికీ మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో బెల్ట్‌షాపులు దర్జాగా కొనసాగుతున్నాయి. ఈ వ్యవహారం అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోకుండా వ్యవహరిస్తుండడాన్ని ప్రజానీకం తీవ్రంగా విమర్శిస్తున్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్, పాతచర్ల, లక్ష్మీకాలనీ, విజయకాలనీ, తేగడ, కలివేరు, సత్యనారాయణపురం, ఆర్ కొత్తగూడెం, కుదునూరు, రాళ్లగూడెం తదితర గ్రామాల్లో బెల్ట్‌షాపులు యథావిధిగా నిర్వహిస్తుండడంతో మందుబాబులు చిత్తగా తాగి చిందులేస్తున్నారు. ఇదే అదునుగా భావించిన బెల్ట్‌షాపుల నిర్వాహకులు ఇబ్బడిముబ్బడిగా ధరలను పెంచి దోచుకుంటున్నారని పలువురు మందు బాబులు వాపోతున్నారు.

అయ్యప్ప మాలధారణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని హరిహర క్షేత్రంలో కార్తీక బుధవారం సందర్భంగా భక్తులు భారీగా అయ్యప్ప మాలధారణలు చేశారు. భక్తులు తెల్లవారు జామున పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నంబూద్రి అరుణ్ రామచంద్రన్, బాధంపూడి సంతోష్ స్వామి నేతృత్వంలో గణపతి పూజలు నిర్వహించి భక్తులకు మాలధారణ చేశారు. అనంతరం ఆలయ ప్రాగణంలో పలువురు దాతల సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎన్ రాజు, శ్రీనివాస్‌రావు, తేజస్వామి, ఉమ మహేశ్వర రావు, ఈశ్వరరెడ్డి, అప్పారావు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ సిలిండర్ల దందా!



పట్టణంలోని ఓ టిఫిన్ సెంటర్‌లో వాడుతున్న డొమెస్టిక్ సిలిండర్

భద్రాచలంఅర్బన్: గ్యాస్ సిలిండర్ల అక్రమ దందా భద్రాచలం పట్టణంలో జోరుగా సాగుతోంది. పట్టణంలో గృహావసరాలకు ఉపయోగించాల్సిన సిలిండర్లు నల్లబజారుకు తరలుతున్నాయి. రాయితీలో వస్తున్న ఈ సిలిండర్లను వ్యాపారం కోసం వినియోగిస్తున్నారు. హోటళ్లు, టిఫిన్ సెంటర్లు తదితరాల్లో గృహావసరాలకు వినియోగించే సిలిండర్లను వాడుతున్నారు. అధికారులు తనిఖీలు చేసి సిలిండర్లు స్వాధీనం చేసుకుంటున్నా అక్రమార్కులు దందాను కొనసాగిస్తున్నారు. పేదలకు ప్రభుత్వం సబ్సిడీపై అందజేసే 'డొమెస్టిక్' సిలిండర్లు ఇలా నల్లబజారున వ్యాపారస్తులకు చేరుతున్నాయి. ఇలా వాడడం నిబంధనలకు విరుద్ధం అని తెలిసినా వ్యాపారస్తులు దొంగచాటున వినియోగిస్తున్నారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది.

చర్యలు తీసుకోవాలి

దమ్మపేట: మండల పరిధిలోని నాయుడుపేట గ్రామం జంక్షన్‌లోని ఎన్‌టీఆర్ విగ్రహం చుట్టూ ఉన్న దిమ్మెకు అతికించిన టైల్స్, లోహపు గ్రిల్‌ను పాక్షికంగా ధ్వంసం చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని తెలుగు దేశం నాయకులు కట్రం స్వామి దొర డిమాండ్ చేశారు. బుధవారం దమ్మపేట గ్రామంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో కట్రం స్వామిదొర మాట్లాడుతూ.. మంగళవారం అర్ధ రాత్రి గుర్తు తెలియని దుండగులు నాయుడు పేట గ్రామంలో ఎన్‌టీఆర్ విగ్రహం చుట్టూ ఉన్న దిమ్మెను ధ్వంసం చేయడానికి ప్రయత్నించారని, శబ్దాలు గమనించిన స్థానికులు విగ్రహం వద్దకు చేరుకుని చూడగా అప్పటికే పరారీలో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో నార్లపాటి శ్రీనివాసరావు, వలీపాషా, గడ్డిపాటి సత్యం, దొడ్డా సత్యం దొడ్డా భాస్కరరావు, నాయుడు సుబ్బారావు పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- కేంద్రాలకు చేరుకున్న ఈవీఎంలు, ఉద్యోగులు
- ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా ఏర్పాట్లు



అశ్వారావుపేటరూరల్: ఎన్నికల సామగ్రితో బస్సు ఎక్కుతూ..



అన్నపురెడ్డిపల్లి: సామగ్రితో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఉద్యోగులు



ములకలపల్లి: పోలింగ్ స్టేషన్ వద్ద ఏర్పాట్లు చేస్తున్న ఎన్నికల అధికారులు



ములకలపల్లి: పోలింగ్ స్టేషన్ వద్ద వేసిన టెంట్లు..

మణుగూరురూరల్: ఎన్నికల నేపథ్యంలో మణుగూరు జెడ్పీ కోఎడ్యుకేషన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ వద్ద నుంచి ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాలు పోలింగ్‌కేంద్రాలకు చేరుకున్నాయి. పినపాక నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్ పర్యవేక్షణలో ఈ యంత్రాలు ఎన్నికల సిబ్బందికి పంపిణీ చేసి వాహనాల ద్వారా వారి వారి పోలింగ్ కేంద్రాలకు తరలించారు. నియోజకవర్గానికి 244 పోలింగ్ కేంద్రాలను కేటాయించగా.. 1,98,402 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 60మంది పరిశీలకులు, 1156 మంది ఎన్నికల సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. పోలింగ్ సిబ్బందికి యంత్రాల పంపిణీ అనంతరం ప్రత్యేక వాహనాలను, ఎస్కార్ట్ ద్వారా కేంద్రాలకు తరలించారు. పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి అధికారులు సకల సదుపాయాలు కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాఘవరెడ్డి, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: నేడు జరిగే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు అంతా సిద్ధం చేసినట్లు అశ్వారావుపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పర్సా రాంబాబు తెలిపారు. స్థానిక వ్యవసాయ కళాశాల ఆవరణలో బుధవారం పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రిని ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని మొత్తం 184 కేంద్రాలకు 184 ఈవీఎంలు, ఓటర్ల జాబిత , ఈవీ ప్యాడ్‌లతోపాలు ఇతర మెటీరియల్‌ను సిబ్బందికి అందజేశారు. ఆయా కేంద్రాలను పోలింగ్ సిబ్బంది, సామగ్రిను తరలించేందుకు ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గంలో మొత్తం 155961 మంది ఓటర్ల ఉండగా, 124 పోలింగ్ స్టేషన్లలో మొత్తం 184 పోలింగ్ బూత్‌లు ఉన్నట్లు తెలిపారు. వీటిలో మవోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలు 3, మరో 4 కేంద్రాలు క్రిటికల్ కేంద్రాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీటిలో మవోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని ఒకొక్క పోలింగ్ కేంద్రానికి 8 మంది, సాధారణ కేంద్రాలకు 4గురు, అలాగే వెయ్యి ఓటర్లు దాటిన మరో 54 కేంద్రాలకు కలిపి మొత్తం 771 మంది పోలింగ్ సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు.

ములకలపల్లి: నేడు జరుగనున్న ఎన్నికలకు సంభందించిన సామగ్రి పోలింగ్‌స్టేషన్లకు చేరింది. నియోజకవర్గకేంద్రమైన అశ్వారావుపేట నుంచి బస్సుల్లో పోలింగ్ ఆఫీసర్లు (పీఓ), ఏపీఓ, పీపీఓలు మండల పరిధిలోని 34 పీఎస్‌లకు ఎలక్షన్ సామాగ్రితో చేరుకున్నారు. ఓటర్లకు అసౌకర్యం కలుగకుండా కేంద్రాల వద్ద టెంట్లు ఏర్పాట్లు చేశారు. విద్యుత్, తాగు నీటి వసతి కల్పించారు.



మణుగూరుటౌన్: ఎన్నికల సామగ్రి పంపిణీలో అధికారులు..

భద్రాచలంటౌన్: భద్రాచలం నియోజకవర్గంలో పోలింగ్ సజావుగా సాగేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నియోజకవర్గంలోని 176 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని బుధవారం స్థానిక డిగ్రీ కళాశాలలో అధికారులు సిబ్బందికి అందజేశారు. ఎన్నికల సామగ్రిని తీసుకున్న సిబ్బంది నియోజకవర్గంలో వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. మొత్తం 175 పోలింగ్ కేంద్రాలకు పీఓ, ఏపీఓ, ఓపీఓలు మొత్తం 700 మంది సిబ్బంది, ఎస్వోలు 25 మంది, నోడల్ అధికారులు 25 మంది విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బందికి ఎన్నికల సామగ్రి అందజేసిన తరువాత నియోజకవర్గంలోని ఐదు మండలాలకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ స్కూల్ బస్సుల ద్వారా ఆయా కేంద్రాలకు పోలీసుల పర్యవేక్షణలో పంపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అధికారులు కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను పరిశీలించే విధంగా ఏర్పాట్లను చేశారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో పోస్ట్ బ్యాలెట్‌లో పలువురు ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

దుమ్ముగూడెం: నేడు జరుగనున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు మండల అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్తున్నారు. ఎన్నికల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు గాను పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల విధుల్లో రాష్ట్ర పోలీసులతో పాటు సీఆర్పీఎఫ్ బలగాలను వినియోగిస్తున్నారు. సమస్యాత్మక, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అదనపు బలగాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల సిబ్బంది సామాగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించారు.

అన్నపురెడ్డిపల్లి: అసెంబ్లీ ఎన్నికల కోసం అధికారులు మండలంలో అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ఎన్నికల అధికారులు బుధవారం సాయంత్రం ఎన్నికల సామగ్రితో ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 20 పోలింగ్ కేంద్రాలలో 16555 ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పీఓ, ఏపీఓ, ఓపీఓలతో పాటు, సెక్టార్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, మైక్రోఅబ్జర్వర్లు, పోలీస్ సిబ్బందితో కలిసి మొత్తం 150 మంది ఎన్నికల విధులు నిర్వహించనున్నారు.

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నేడు జరిగే పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. అశ్వారావుపేట నియోజకవర్గంలోని అశ్వారావుపేట మండలంలో 51 పోలింగ్ కేంద్రాలు, అన్నపురెడ్డిపల్లి మండలంలో 20 పోలింగ్ కేంద్రాలు, చంద్రుగొండలో 27, దమ్మపేటలో 52, ములకలపల్లి మండలంలో 34 చొప్పున మొత్తం 184 పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. కాగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో బుధవారం సాయంత్రం నాటికి ఓటర్ల కోసం ప్రత్యేకంగా టెంట్‌లు, తాగునీటి వసతితోపాలు పలు సౌకర్యాలను కల్పించారు.



మణుగూరురూరల్: ఈవీఎంలను పంపిణీ చేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్



దుమ్ముగూడెం: సామగ్రితో ఉద్యోగులు



సామగ్రిని తీసుకొని వెళ్తూ..



మణుగూరురూరల్: పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న ఎన్నికల సిబ్బంది



అశ్వారావుపేటరూరల్: పోలింగ్ సిబ్బంది కోసం సిద్ధంగా ఉన్న బస్సులు

'సిరా' చుక్క బయోగ్రఫీ

భద్రాచలంఅర్బన్: ప్రస్తుతం తెలంగాణలో ఎన్నికల సందడి నెలకొంది. నేడు రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాలకు పోలింగ్ జరగనుంది. అయితే ఎన్నికలంటే మనకు తక్కున గుర్తొచ్చేది సిరా చుక్క. ఎన్నికల్లో ఓటరు తన ఓటుహక్కు వినియోగించుకున్నాక సిరా మార్క్ చూపిస్తూ.. 'నేను ఓటేశానోచ్..' అంటూ సగర్వంగా చెప్పుకుంటారు. ఇంకొందరు సెల్ఫీలు తీసుకొని సోషల్ మీడియాలోనూ అప్‌లోడ్ చేస్తారు. అయితే ఎన్నికల్లో వాడే సిరా మార్క్ మనం తుడిచినా పోదు. ఒక్కసారి సిరా గుర్తు వేలిపై పడితే.. 72 గంటల వరకు చెరిగిపోదు. మరోసారి బోగస్ ఓట్లు (దొంగ ఓట్లు) వేయకుండా ఎన్నికల సంఘం దీన్ని ప్రవేశపెట్టింది. ఎన్నికల్లో పోలింగ్ రోజున ఓటు వినియోగించుకున్న ఓటర్లను గుర్తించేందుకు వీలుగా చేతి వేలికి చెరిగిపోని సిరా వేస్తారు.

ఓటు వేయడానికి ముందే ఓటర్ల ఎడమ చేయి చూపుడు వేలుకు సిరా వేస్తారు. గోరు మీది నుంచి వేలి మొదటి జాయింట్ వరకు వేస్తారు. ఆ తర్వాతే ఓటు వేయాల్సి ఉంటుంది. ఎడమ చేయి చూపుడు వేలు లేని పక్షంలో మధ్య వేలు.. లేదంటే ఉంగరపు వేలు, లేదా చిటికెన వేలు, బొటన వేలికి గానీ వేస్తారు. ఎడమ చేయి లేనిపక్షంలో ఇదే వరుసలో కుడిచేతికి సిరా పెట్టాల్సి ఉంటుంది. రెండు చేతులకు వేళ్లు లేనట్లయితే ఎడమ భుజం, ఏదైనా కనిపించే ప్రదేశం, లేదా ముఖంపై సిరాతో గుర్తించాల్సి ఉంటుంది. ఎవరైనా ఓటు వేయలేని స్థితిలో ఉంటే వారు ఓటు వేయడానికి సహకరించేందుకు వెళ్లే వారికి కుడి చేతి చూపుడు వేలుకు సిరా వేస్తారు.

ఆదర్శ పోలింగ్ బూత్‌లివే..



ప్రత్యేకంగా ముస్తాబు చేసిన ఆదర్శ మహిళా పోలింగ్ బూత్

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాలతో అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలోని పలు పోలింగ్ బూత్‌లను బుధవారం ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. అందులో భాగంగా ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద రంగుల ముగ్గులు వేశారు. తోరణాలు కట్టి, ఆయా ప్రాంతాల్లోని ఓటర్లకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి అలంకరించారు. ఆయా ఆదర్శ బూత్‌లను పరిశీలిస్తే.. స్థానిక ఐకేపీ కార్యాలయంలోని పోలింగ్ బూత్ నంబరు 159ను ఆదర్శ మహిళా పోలింగ్ బూత్‌గా, అలాగే స్థానిక సీపీఎస్ స్కూల్‌లోని పోలింగ్ బూత్ నంబరు 169ను ఆదర్శ యువత పోలింగ్ బూత్‌గా ఏర్పాటు చేశారు. మరోవైపు మండలంలోని పేరాయిగూడెం గ్రామ పంచాయతీలోని నెహ్రూనగర్ ఎంపీపీఎస్ స్కూల్ లోని పోలింగ్ బూత్ నంబరు 165ను ఆదర్శ దివ్యాంగుల పోలింగ్ బూత్‌గా నిర్ణయించారు. ఆయా కేంద్రాలను ప్రత్యేకంగా సిద్ధం చేశారు. దాంతో ఆయా పోలింగ్ బూత్‌లు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

పినపాకకు భారీ బందోబస్తు



అశ్వారావుపేటరూరల్: పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న పాల్వంచ డీఎస్పీ వెంకటేష్

మణుగూరురూరల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నేడు పినపాక నియోజకవర్గంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో భారీ బందోబస్త్ ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. సుమారు 400మంది పోలీస్, సీఆర్పీఎఫ్, ఇతర విభాగాల బలగాలతో గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలో ఎన్నికలకు 2 డీఎస్పీలు, 8 మంది సీఐలు, 12 మంది ఎస్సైలు, పారా మిలటరీ, సీఆర్‌పీఎఫ్, ప్రత్యేక బలగాల నడుమ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట భద్రత చర్యలు తీసుకున్నట్లు డీఎస్పీ రాఘవేంద్రరావు, 244పోలింగ్ కేంద్రాల్లో 124 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. వీటిలో 17 కేంద్రాలు ఎటువంటి కమ్యూనికేషన్ లేనందును నిఘా పెంచి భద్రత చర్యలను కట్టుదిట్టం చేశామన్నారు. ఎన్నికల సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన ఓటర్లు పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు.



మణుగూరురూరల్: సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవేంద్రరావు

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేటరూరల్: ఎన్నికల సిబ్బందికి సామగ్రి పంపిణీలో బుధవారం పాల్వంచ డీఎస్పీ వెంకటేష్ మాట్లాడారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు నియోజకవర్గంలో 440 మంది స్థానిక పోలీస్ సిబ్బంది, 6 కేంద్ర బలగాలను కేటాయించినట్లు తెలిపారు. మవోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలుగా అశ్వారావుపేట మండలంలోని కావడిగుండ్ల, కన్నాయిగూడెం, రామన్నగూడెం, గాండ్లగూడెం, దమ్మపేట మండలంలోని మెద్దులగూడెం, రెడ్యాలపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక భద్రత, నిఘా ఉంచినట్లు ఆయన వెల్లడించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సహకారాన్ని అందించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వో, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ ప్రక్రియ ఇలా..

- ఉదయం 6.30లోపు మాక్ పోలింగ్
- 7 గంటలకు ఓటింగ్ ప్రారంభం
- సాయంత్రం 4 గంటలకు ముగింపు
- ఆ లోపు గేటు లోపల ఉంటే వేయడానికి అనుమతి



భద్రాచలంఅర్బన్: ఎన్నికల పర్వంలో పోలింగ్ రోజు అత్యంత కీలకం. అయితే ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఈవీఎంల తరలింపు మొదలుకుని ఓటింగ్ ప్రక్రియ ఏ విధంగా కొనసాగుతుంది? ముగిసిన అనంతరం కౌంటింగ్ కేంద్రాల వద్ద ఉన్న స్ట్రాంగ్ రూంలకు తరలించే వరకు కొనసాగే ప్రక్రియ ఎలా ఉంటుంది? పోలింగ్ అధికారుల విధులు, పోలింగ్ ఏజెంట్ల బాధ్యతలు ఏంటి? అనే అంశాలపై నేటి కథనం.

మాక్ పోలింగ్‌తో మొదలు..

ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల ఆధీనంలో ఉన్న ఈవీఎం యంత్రాలతో పాటు సిబ్బంది ఇప్పటికే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఇక ఈ రోజు (పోలింగ్ రోజు) ఉదయం 5.30 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల తరఫున వచ్చిన ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ఉదయం 6:30 లోపే మాక్ పోలింగ్ ప్రక్రియను ముగించాలి. మాక్ పోలింగ్‌లో 50 ఓట్లకు తగ్గకుండా ఓట్లు వేసి ఏజెంట్ల సమక్షంలో లెక్కిస్తారు. ఇందులో నోటాకు సైతం ఓట్లు వేసి పరిశీలించాల్సి ఉంటుంది. అన్నిసరిగానే ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత వారి సమక్షంలో ఈ యంత్రాలను క్లియర్ చేసి ఓటింగ్ ప్రక్రియను ప్రారంభిస్తారు. ఉదయం 7గంటలకు ఓటింగ్ ప్రారంభమవుతుంది.

ఏజెంట్ల పాత్ర..

ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ కేంద్రాల్లో రాజకీయ పార్టీల అభ్యర్థుల తరఫున పోలింగ్ ఏజెంట్లు ఉంటారు. ఓటు వేయడానికి వచ్చిన ఓటరు నిజమైన వ్యక్తి లేదా బోగస్ ఓటరా అని పోలింగ్ ఏజెంట్లు నిశితంగా పరిశీలిస్తారు. పోలింగ్ కేంద్రంలో ప్రతి అభ్యర్థి తరఫున ఒక పోలింగ్ ఏజెంటు ఇద్దరు రిలీఫ్ ఏజెంట్లను నియమించుకోవచ్చు. అందులో ఒక్కరు మాత్రమే కూర్చోడానికి అవకాశం ఉంటుంది. పోలింగ్ ఏజెంట్లు ఫారం 10లో పోటీ చేస్తున్న అభ్యర్థి లేదా అతని ఎన్నికల ఏజెంట్ నియామక పత్రం పొందిన వారికి ఏజెంట్ పాసును జారీ చేస్తారు. ఓటరు జాబితాను బయటకు తీసుకెళ్లేందుకు వీలు ఉండదు. పోలింగ్ ఏజెంట్లు స్థానికుడై ఉండి ఎన్నికల కమిషన్ అనుమతించిన ఫొటో గుర్తింపు కార్డును కలిగి ఉండాలి.

అధికారుల విధులు ఇలా..

ఎన్నికల్లో పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించడంలో పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వర్తించే సిబ్బందిదే బాధ్యత. ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారితో పాటు ఒక సహాయ ప్రిసైడింగ్ అధికారి మరో ఇద్దరు ఇతర ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల నిర్వహణ బాధ్యతల్లో ఉంటారు. పోలింగ్ కేంద్రం మొత్తం బాధ్యతను ప్రిసైడింగ్ అధికారి పర్యవేక్షిస్తారు.

రెండు గంటలకోసారి పోలింగ్ శాతం వెల్లడి..

పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ప్రక్రియ మొదలైనప్పటి నుంచి ప్రతి రెండు గంటలకు ఓసారి పోలింగ్ శాతాన్ని ఎన్నికల అధికారులు అధికారికంగా వెల్లడిస్తారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 17-ఏ రిజిస్టర్‌లో నమోదైన ఓట్లు, ఓటర్ స్లిప్పులు, కంట్రోల్ యూనిట్లలోని మొత్తం నమోదైన ఓట్లు ఏకీభవించాలి. అప్పుడే పోలింగ్ శాతాన్ని ప్రకటించాల్సి ఉంటుంది. పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓటింగ్ శాతాన్ని ప్రిసైడింగ్ అధికారులు సంబంధిత సెక్టార్ అధికారులకు పంపుతారు. సెక్టారు అధికారులు జిల్లా అధికారులకు సమాచారం అందిస్తారు.

ఓట్ల ముగింపు..

పోలింగ్ సాయంత్రం ఐదు గంటలకు ముగుస్తుండగా.. 15 నిమిషాల ముందే వెల్లడించాల్సి ఉంటుంది. సాయంత్రం ఐదు గంటల లోపు పోలింగ్ కేంద్రం లోపల ఉన్నవారందరూ ఓటు వేయడానికి అర్హులే. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత కంట్రోల్ యూనిట్లో క్లోజ్ బటన్ నొక్కుతారు. అనంతరం కంట్రోల్ యూనిట్‌లో మొత్తం ఓట్లు 17-ఏలో ఉన్న మొత్తం ఓట్లు, ఓటర్ స్లిప్పులు సరిపోలతోఉన్నాయా లేదా నిర్ధారించుకోవాల్సి ఉంటుంది.

కౌంటింగ్ కేంద్రాలకు చేరేదిలా..

పోలింగ్ ముగిసిన వెంటనే సీల్ వేసి క్లోజ్ చేసిన ఈవీఎం యంత్రాలను ఆయా నియోజకవర్గాల్లో పంపిణీ కేంద్రాలకు చేరుస్తారు. ఆ మరుసటి రోజుప్రత్యేక భద్రత మధ్య ఆయానియోజకవర్గాలకుకేటాయించిన లెక్కింపు కేంద్రాలవద్దగల స్ట్రాంగ్ రూంలోనికి తరలిస్తారు.